జోన్-5లో సమస్యల తిష్ట

- అరకొర సిబ్బందితో పారిశుధ్య పనులు
- చిన్నపాటి వర్షాలకే రహదారులు, డ్రైనేజీలు అధ్వానం
- కార్మికులను పెంచాలని విజ్ఞప్తి


జోన్-5 పరిధిలోని 56వ వార్డులో డ్రైనేజీలు, రహదారి దుస్థితి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5లో పారిశుధ్య సమస్యలు తిష్ట వేశాయి. పారిశుధ్య కార్మికుల కొరతే ఇందుకు కారణం. జోన్ పరిధిలోని ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాల్లో 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. వీటిలో పారిశుధ్య కార్మికుల కొరత ఎక్కువగా ఉండటంతో శానిటేషన్ పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్, కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, ఎన్ఏడీ కొత్తరోడ్డు, మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా తదితర ప్రాంతాల్లో జన సంచారం, వ్యాపారాలు అధికంగా ఉంటాయి. ఈ ప్రాంతాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఎక్కువగా ఉంది. జీవీఎంసీ పరిధిలో వార్డుల విస్తీర్ణం పెరిగినా.. పారిశుధ్య కార్మికుల సంఖ్య పెరగలేదు. దీంతో ఉన్న కార్మికులనే పారిశుధ్య పనులకు సర్దుబాటు చేస్తున్నారు. పర్మినెంట్ సిబ్బంది, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. వీరి పర్యవేక్షణకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లేని వార్డుల్లో మేస్త్రీలు, సచివాలయ శానిటరీ సెక్రటరీలను పబ్లిక్ హెల్త్ అధికారులు వినియోగిస్తున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది..

జోన్ పరిధిలోని 24 వార్డులకు 24 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా.. పూర్తిస్థాయిలో లేరు. ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 9 మంది ఔట్ సోర్సింగ్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, ఒక పబ్లిక్ హెల్త్ వర్కర్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు 106 మంది ఆయా వార్డుల్లో విధులు నిర్వహిస్తున్నారు. వార్డుల్లో కార్మికులు సరిపోక పోవడంతో రిటైర్డ్ సిబ్బందితో ఆఫ్‌టింగ్‌లుగా తీసుకుంటున్నారు. పారిశుధ్య సిబ్బంది సెలవు పెడితే గల్లీలు దుర్గంధంగా మారుతున్నాయి. అవగాహన లేని మలేరియా, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించడంతో కొన్ని వార్డుల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- జోన్-5 పరిధిలో సరిపడా పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి.
- కాలువలు, గెడ్డలు, కల్వర్టులు పూడికలతో నిండిపోవడంతో చెత్తాచెదారం తొలగించడానికి సిబ్బంది కొరత కారణంగా చూపిస్తున్నారు.
- తడి-పొడి చెత్త సేకరణ, క్లాప్ వాహనాలు, గల్లీలో రోడ్లు, కాలువలు శుభ్రపరచడానికి ఉన్న సిబ్బందితో కాలం గడిపేస్తున్నారు.
- చిన్నపాటి వర్షాలకే రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా మారుతున్నాయి.
- ప్రస్తుత వర్షా కాలంలో పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యే అవకాశముంది.
- శాశ్వత వర్కర్లు 166 మంది, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు 106 మంది, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది 1,023 మందితో నెట్టుకొస్తున్న జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారుల పనితీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని, పారిశుధ్య కార్మికులను పెంచాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.


బిర్లా జంక్షన్‌లో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో సునీల్‌కుమార్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



జీవీఎంసీ జోన్-5 పరిధిలో పారిశుధ్య కార్మికుల కొరత వాస్తవంగా ఉన్నా.. వార్డుల వారీగా సిబ్బందిని సర్దుబాటు చేశాం. పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తూ, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో కార్మికులను భాగస్వాములను చేశాం. వార్డుల్లో సిబ్బందిని నియమించేందుకు జాబితాను తయారు చేశాం. సిబ్బంది కొరత ఉన్న స్థానంలో కొత్త వారిని నియమించేందుకు జీవీఎంసీ మేయర్, కమిషనర్, జోనల్ కమిషనర్ల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లాం.

– డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏఎంహెచ్‌వో, జోన్-5

జీవీఎంసీ జోన్-5లో పారిశుధ్య సిబ్బంది వివరాలు

వార్డు	శాశ్వత కార్మికులు	ఔట్ సోర్సింగ్	నైట్ కార్మికులు	సూపర్ వైజర్లు	డిప్యూటేషన్	వార్డు	శాశ్వత కార్మికులు	ఔట్ సోర్సింగ్	నైట్ కార్మికులు	సూపర్ వైజర్లు	డిప్యూటేషన్
40	02	09	09	00	01	52	06	35	41	04	00
41	17	18	35	04	01	53	06	31	37	02	00
42	15	31	46	03	01	54	09	34	41	04	02
43	12	25	37	03	01	55	12	26	38	04	01
44	06	45	51	04	00	56	08	35	43	04	01
45	02	40	41	02	06	57	11	31	42	02	01
46	05	23	28	00	00	58	11	31	42	03	05
47	06	27	31	03	00	59	04	34	38	03	02
48	06	34	40	03	02	60	06	39	44	04	00
49	05	45	50	02	03	61	08	27	34	02	03
50	01	33	33	03	01	62	04	28	31	01	01
51	01	47	47	04	01	63	03	21	23	02	00

వినతుల పరిష్కారానికి చర్యలు


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆరు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, రెవెన్యూ విభాగానికి 03 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. వినతుల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సాయంత్రం సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జెడ్సీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వో బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, టీపీవో విజయకుమార్, డీఈ భరణికుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

మెగా జాబ్‌డ్రైవ్‌లో 172 మంది ఎంపిక


జాబ్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్), నిర్మాన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఎస్ఆర్‌సీ అండ్ జేకేసీ విభాగం మెగా జాబ్ డ్రైవ్ నిర్వహించింది. ఎస్ఆర్‌సీ అనుబంధ 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 16 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 436 మంది విద్యార్థులు పాల్గొనగా.. 172 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు


అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరాంమూర్తి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం సుమారు 10 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ, ఆర్ఐ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

సీతమ్మధార: ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రత్యేక దృష్టి సారించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజలకు ఆయన అందుబాటులో ఉన్నారు. ప్రజా సమస్యలపై పలువురు వచ్చి ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. దీనిపై సానుకూలంగా ఆయన స్పందించారు.

కుంచుమాంబ మారువారం పండగ నేడు

సీతంపేట: అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని మూడుగుళ్ల వద్ద కొలువైన కుంచుమాంబ అమ్మవారి మారువారం పండగ మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము 5 గంటల నుంచి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేస్తామని, భక్తులు మొక్కులు చెల్లించుకోవచ్చన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించి తరించాలని కమిటీ సభ్యులు కోరారు.

న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా సీతామాణిక్యం


బాధ్యతలు స్వీకరిస్తున్న సీతామాణిక్యం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య కె.సీతామాణిక్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆచార్య వి.విజయలక్ష్మి నుంచి ఆమె ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీతామాణిక్యంకు న్యాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విశ్రాంత ఆచార్యులు అభినందనలు తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

'మీల్స్ అగ్రిమెంట్‌ను వ్యతిరేకిస్తున్నాం'

మల్కాపురం: కార్మికులకు సంబంధించిన మీల్స్ అలవెన్స్‌కు సంబంధించి ఐఎన్‌టీయూసీ ఇటీవల షిప్‌యార్డ్ యాజమాన్యంతో చేసిన అగ్రిమెంట్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని షిప్‌యార్డ్ సీఐటీయూ యూనియన్ ప్రతినిధులు బి.ఎస్.ఎన్.రాజు, ఎస్.ప్రసాద్ అన్నారు.ఈ అంశంపై మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో వద్ద సోమవారం వారు మాట్లాడుతూ మీల్స్ అలవెన్స్‌పై ఇటీవల యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్ ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు.

శివుని ప్రతిరూపమే శంకరాచార్యులు


ప్రవచిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కుర్తాళం శంకరాచార్యులు, పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ప్రవచనం చేశారు. జగద్గురు శంకర విజయంపై స్వామివారు చేసిన ప్రవచనం ఆద్యంతం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శంకరాచార్యులు సాక్షాత్ శివుడి అవతారమని, శంకరుల అవతరణ నాటికి భారతావనిలో ధార్మిక వాతావరణాన్ని వివరించారు. సన్యాసాశ్రమ వైశిష్ట్యాన్ని, జప తప హోమాల గురించి తెలియజేశారు. శంకరులు అద్వైత సిద్ధాంతం ప్రచారం ద్వారా దేశంలో జాతీయ సమైఖ్యతకు దోహదం చేశారని చెప్పారు. శంకరాచార్యులు మహాకవి అని, అపారమైన స్తోత్ర వాఙ్మయం, భక్తి సాహిత్యం సృష్టించారని వారి కవిత్వం, బోధనల ప్రభావం నేటికీ సమాజంపై ఉందని అభిభాషించారు. శంకరుల జీవితంలోని పలు సంఘటనలు, ఉదంతాలను సభారంజకంగా ప్రవచించారు. శక్తి పీఠాదీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, అశేష భక్తజనం స్వామి వారి భాషణాన్ని ఆలకించి పులకించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఏపీ పాత్రోకు ఘన నివాళి


పాత్రో విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, ఒడిశా రాష్ట్ర తొలి అసెంబ్లీ స్పీకర్, ఏయూ వ్యవస్థాపనకు కృషి చేసిన విద్యా ప్రధాన సర్ రావు బహదూర్ అన్నెపు పరశురామ్ పాత్రో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఏయూలోని పాత్రో విగ్రహానికి అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ ఆచార్య హెచ్.లజపతిరాయ్ పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లజపతిరాయ్ మాట్లాడుతూ ఏయూ చరిత్రకు కారకుల్లో పాత్రో ప్రముఖులన్నారు. ఉత్తరాంధ్ర విద్యా ప్రదాతగా పరశురాం పాత్రో నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీరామ్, రవి, ఆచార్య పి.హరి ప్రకాష్, ఆచార్య జి.సుదర్శనరావు, డాక్టర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీలు దోహదం


గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులతో అతిథులు, అంగన్‌వాడీ టీచర్లు

కంచరపాలెం: పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడతాయని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి అన్నారు. 47వ వార్డు కంచరపాలెం జై ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యార్థులను ఆహ్వానిస్తూ, 5 ఏళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీడీపీవో రమణికుమారి మాట్లాడుతూ ప్రతి చిన్నారికి బాల్యం నుంచే విద్యపై మక్కువ పెంచుకునేలా అంగన్‌వాడీల ప్రణాళికలు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని, పిల్లలను కేంద్రాలకు విధిగా పంపాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత టీచర్లపై ఉందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, ప్రథమ టీం సభ్యురాలు హఫిజా, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన


సుబ్బలక్ష్మీనగర్ సచివాలయంలో అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు సుబ్బలక్ష్మీనగర్‌లోని 233, 234 సచివాలయాలను సోమవారం దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి, జీవీఎంసీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. పర్యటనలో జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏపీడీ పద్మావతి, వార్డు స్పెషల్ ఆఫీసర్ బాబూరావు, ఏఈ రమణమ్మలతో పాటు టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకిరెడ్డి జగదీష్, వార్డు ప్రెసిడెంట్ కె.వెంకటరమణ, సెక్రటరీ ముక్కి రామకృష్ణ, సీనియర్ నాయకులు ముప్పాళ్ల కృష్ణ, ఎంఎల్ఎన్ రావు, దువ్వి కాశీ ప్రసాద్, జేకే, వార్డు మహిళా ప్రెసిడెంట్ కుంతీ, శ్రీవేణి, సీత, ఇతర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం



డాబాగార్డెన్స్: నగరంలోని టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవం జూలై 4 నుంచి 19వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 4న గురువారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి, సాయంత్రం ప్రతిష్ఠా ప్రారంభ సంకల్పం, 5న అమావాస్య ఉదయం జలాధివాసములు, క్షీరాధివాసములు, రాత్రి విశేష హోమాలు, పంచశయ్యాది వాసములు, 6న ఆషాఢ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహనం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 7న ఉదయం 9.20 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు జగన్నాథస్వామి తొలి రథ యాత్ర ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 8 నుంచి 17వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిస్తారు. 18న ఉదయం 12.15 గంటలకు స్వామి రథంపైకి ఆహ్వానించనున్నారు.

ప్రజా రవాణాను వినియోగిద్దాం


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తమ క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ప్రజా రవాణా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన పర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒక రోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించి, కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు, కార్మికులు

మహారాణిపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో 549 ప్రకారం కార్మికులకు రూ.16 వేల జీతం అమలు చేయాలని, వివిధ కటింగ్‌లు చూపిస్తూ రూ.11,200 మాత్రమే చెల్లిస్తున్నారని యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటరావు అన్నారు. త్వరలో ఈ కాంట్రాక్టు ముగుస్తుందని, కాంట్రాక్టు ముగిసే సమయానికి బకాయిలు లేకుండా జీతాలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో పీఎఫ్ కట్టలేదని అడిగినందుకు ఆర్.ఆదిలక్ష్మిని సంబంధిత కాంట్రాక్టర్ అన్యాయంగా తొలగించారని, దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.కనకరాజు, డి.రాజేశ్వరి, డి.భాగ్య, కేశవరావు, పోతురాజు, పి.రాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా బీసీజీ వ్యాక్సినేషన్


వెంకటేశ్వరమెట్ట గ్రంథాలయ ఆవరణలో బీసీజీ వాక్సిన్స్ వేస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో బీసీజీ వ్యాక్సినేషన్ చురుగ్గా సాగుతోంది. సోమవారం స్థానిక సచివాలయాల పరిధిలో బీసీజీ టీకాలు వేశారు. 60 ఏళ్లు దాటిన వారు, సుగర్ వ్యాధిగ్రస్తులకు టీబీ వంటి వ్యాధులు వ్యాపించకుండా నిరోధించేందుకుగాను ముందస్తుగా బీసీజీ టీకాలు వేస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. హృద్రోగం, బైపాస్ సర్జరీలు చేయించుకున్నవారు మాత్రం వేసుకోరాదని సూచించారు. కొబ్బరితోట సచివాలయం పరిధిలోని గౌరీ వీధి, బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట-1, 2 సచివాలయాల పరిధిలో సుమారు 30 మందికి ఈ టీకాలు వేసినట్లు వైద్య సిబ్బంది చెప్పారు. వెంకటేశ్వరమెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆశ వర్కర్లు బుద్ధ లీలావతి తదితరులు పాల్గొని బీసీజీ టీకాలపై అవగాహన కల్పించారు.

కాలుష్య రహిత ప్రాంతంగా ఆటోనగర్


మొక్కలు నాటుతున్న పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్‌ఎంఈ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌ను కాలుష్యరహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) ఏడీ చంద్రమౌళి కోరారు. ఆటోనగర్ ఎఫ్- బ్లాక్‌లో ఎంఎస్‌ఎంఈ, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సంయుక్తంగా సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని పారిశ్రామిక ప్రాంతమైన ఆటోనగర్‌లో ప్రతీ పారిశ్రామిక వేత్త ఆచరించాలని కోరారు. ఎంఎస్‌ఎంఈ అధికారులు, సిబ్బంది, వాసీవా, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ఐలా సిబ్బంది స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. ఎఫ్-బ్లాక్‌లో ర్యాలీ నిర్వహించారు. ఆటోనగర్ వాసీవా అధ్యక్షుడు ఎస్.పాండు రంగ ప్రసాద్, ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు, ఏడీ ఎఫ్-బ్లాక్‌లో పలు పరిశ్రమల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఎస్‌ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ బి.ప్రభాకర్ కుమార్, ఏడీలు పాల్గొన్నారు.